# ఆత్మీయత

-వి. భారతీశర్మ

జానపద నృత్యంలోలా గట్లమీద గడ్డిమోపు ఎత్తుకుని వయ్యారంగా నడిచి వెళ్ళే కూలీలూ...

దూరాన అద్దంలా పరిచిఉన్న కుంటల చెరువు,

'హుర్ హుర్' అనే అదిలింపులతో ఊరివైపు కదిలి పోయే పశుల మందలూ

ఆ సాయంత్రపు నీరెండలో పసిడిపూత పూసిన వరిచేలూ...



ఇక ఆ ప్రాంతాలకు వచ్చే పని లేదనుకుంటే పుట్టెడు దిగులు ముంచుకొచ్చింది రంగనాథంకి.

గట్టుమీద నిలబడి తన పొలాన్ని ఓసారి చూసుకుని నిట్టూర్చాడు.

పొలం కొలవటం అయిపోయింది. పట్వారీ వెళ్ళిపోయాడు.

షావుకారూ, అనుమయ్యా బోరుపంపు దగ్గర కాళ్ళూ చేతులూ కడుక్కొచ్చి రంగనాథంతో అన్నారు "రంగన్నా, నీవు ఇంటికి పద మేము బండకాడి పొలం కోత కొచ్చిందేమో చూసొస్తాం"

దూరాన వెళ్ళే రంగనాథాన్ని చూస్తూ షావుకారు అన్నాడు! "అనుమయ్య ఈయన పొలం కొనటం నాకేమన్నా లాభం అనుకున్నావా? అబ్బే, నయాపైసా లేదంటే నమ్ము. తమ్ముడి కోసం నా దగ్గర చేసిన అప్పు ఎంత పెరిగిపోయిందను కున్నావ్. అసలూ లేదూ, వడ్డీ లేదూ. మరి ఎట్టా తీరుద్దామనుకున్నాడయ్యా?"

"లేదులే షావుకారూ, ఇప్పటికీ నీకీ పొలం అమ్మింది నీ బాకీకి భయపడి కాదులే. కూతురి పెళ్ళి పెట్టు కున్నారుగా కట్నం కావద్దూ? గదీసంగతి!"

"ఏందయ్యా నీవనేది? నా బాకీ పోంగా మిగిలేదెంత నీ? బాకీపోగా మిగిలిందే చేతులో పెట్టేట్లు చెప్పినా."

"అవున్లే షావుకారూ ఎట్లా రాల్తాయ్ పైసలు మరి. చెరువు కింది పొలం అమ్మి చెల్లికి గొప్ప సంబంధం తెచ్చి పెళ్ళి చేశాడు.

నీ దగ్గర అప్పుచేసి తమ్ముణ్ణి డాక్టర్ చేసె. ఇప్పుడు అప్పులకూ, కూతురి పెళ్ళికీ ఈ కాస్త పొలం అమ్మి రేపు తమ బతుకులెట్లా అని ఆలోచించు కున్నాడు పిచ్చి మాలోకం.

తమ్ముడు రేపు ఏదో ఇక్కడ ప్రాక్టీస్ పెట్టి తమని ఉద్ధరిస్తాడంట! మాబులబాటంగా ఉందిలే షావుకారూ. నాకు తెలీకంటా కడుపున పుట్టినోడే బువ్వపెట్టని రోజులు, ఆడు పెడతాడటయ్యారంగన్న పిచ్చిగానీ!"

వంకాయల్లోకి ఉల్లికారం కూరుతున్న తల్లి దగ్గరకి

హడావడిగా "అబ్బ గుత్తి వంకాయ్, పెరుగు పచ్చడి! బ్బాబాయ్ వస్తాడా అమ్మా?" అడిగింది తరళ.

సమాధానం చెప్పకుండా కూతుర్ని తీక్షణంగా చూస్తూ "ఊరు బలాదూర్ తిరగటం అయ్యిందా? శలవు రోజన్నా కొస్త ఇంటి పట్టునుండి పనీపాటా నేర్చుకుంటావా లేదా? అక్కకి కాస్త సాయపడితే తప్పటే? పో పోయి ఆరిన గుడ్డలు మడతలు పెట్టి లోపల పడేయ్" అంది.

కోపంగా ఉన్న తల్లిని ఇంకేమీ అడక్కుండా మెల్లగా సావిట్లో జాజిపూలు గుచ్చుతున్న సరళక్క దగ్గర కొచ్చింది.

సరళ తరళని చూసి ముసిముసిగా నవ్వుతూ "ఎక్కడి కెళ్ళావే?" అంది.

"హమ్మయ్యా. సరళక్కా నువ్వైనా నవ్వుతూ పలక రించావ్. సరేకానీ సుబ్బమ్మత్తగారి కర్రావు ఈనింది తెలుసా? లేగదూడ ఎంత ముద్దొస్తోందో! రేపు మనకి జున్నుపాలు పంపుతానంది అత్త. దూడ ముద్దొస్తుందంటే నాకిచ్చేస్తా నన్నాడు రామంబావ."

"ఆ ఇస్తాడు! కుక్కపిల్లనంటే ఇచ్చాడు దూడనెందు కిస్తాడేంటీ?"

"అమ్మా నువ్వా ఆ కుక్కపిల్లను తేనిస్తేగా. అవును కానీ సరళక్కా! రామం బావంటే నీకిష్టం లేదూ? నా ముఖం చూసి చెప్పూ" అంది స్థిరంగా కూర్చుంటూ.

తరళ వంక ఓ క్షణం చూసి పూలు గుచ్చటంలో మునిగిపోయింది సరళ.

"నా మాటకు సమాధానం చెప్పవా సరళక్కా?"

"ఆ వుంటే ఏం చేయాలీ?"

"ఛీ వట్టి పిరికి పందవి! ధైర్యం లేదు. నేను చూడూ పేచీపెట్టి పొరుగూరువెళ్ళి కాలేజీలోచదువుతున్నానా?"

సరళ కళ్ళల్లో నీళ్ళ తడి చూసి నొచ్చుకుంటూ.

"కాదు సరళక్కా 'నాకీపెళ్ళొద్దు రామం బావనే చేసు కుంటా'నని చెప్పొచ్చుగా?"

"అమ్మో! అమ్మా నాన్నా ఏమనుకుంటారే? వాళ్ళ నెదిరించొచ్చా?"

"ఇందులో ఎదిరించటం ఏముందీ, నీ ఇష్టాన్ని చెప్పటానికి? నే చెప్పేదా అమ్మతో?"

"వద్దే తల్లీ అంతపని చేయకు ఎట్లా అయ్యేదుంటే అట్లా అవుతుంది."

"అమ్మా సరళా, బాబాయ్ ఈ బస్సుకొచ్చే టయి మైంది. స్నానానికి వేడినీళ్ళు అవీ చూడు." అని తండ్రి పిలవగానే పూలు గుచ్చటం తరళ కప్పగించి లేచింది సరళ.

భోజనాలు ముగిసిన తరువాత భర్తకీ, మరిదికీ ఉక్కగా ఉందని వంటింటి వరండాలో పక్కలు వేసింది భవానీ. ఆ ప్రక్కనే తనూ పిల్లలూ వేసుకున్నారు.

మంచంమీద కూర్చుంటూ అడిగాడు మూర్తి "అన్నయ్యా, పొలం ఎందుకమ్మాల్సి వచ్చిందీ?"

"నీకు రాజ్యం చెప్పలేదట్రా? ఇక్కణ్ణుంచి వెళ్ళగానే నీకు కబురు పెడతానందిగా?"

"ఈ మధ్య రాజ్యం అక్కాళ్ళింటికి వెళ్ళటం పడలే దన్నయ్యా. పొలం అమ్ముడు అయ్యింది నీ సంతకం కూడా కావాలి కదా, రమ్మని నువ్వు వ్రాసిన ఉత్తరం చూసి వస్తున్నట్లుగా ఉత్తరం వ్రాశా అంతే."

"బాగుంది! రాజ్యం నీకు కబురు చేసి చెప్పొచ్చుగా? అదేరా మన సరళకి సంబంధం తీసుకొచ్చింది. అదేదో కంపెనీలో పనట. మంచిజీతం, తెలిసిన పిల్లాడు అని తీసుకొచ్చింది. కాస్త పళ్ళెత్తైనా బాగానే ఉంటాడు." అన్నాడు రంగనాథం.

మూర్తి అనుమానంగా "పేరేంటట?" అడిగాడు.

"ప్రకాశరావు."

"ఓ వాడా? రాజ్యం అక్కకి బుద్దుందా? సరళని వాడికివ్వమని తీసుకొచ్చిందా? వాడు వాళ్ళింట్లో చెమ్చాగిరీ చేస్తుంటాడు. వాళ్ళింటో అన్నిపన్లూ చేస్తుంటాడులే. తాగు బోతనికూడా విన్నాను. కట్నం తక్కువనీ కంపెనీలో ఉద్యోగ మనీ, మురిసిపోయావేకాని వాణ్ణి వాకబ్ చేశావా?"

"నాకేం తెలుసురా? రాజ్యంకి మన బాగోగులు చూసే బాధ్యత ఉందనుకున్నానే కానీ..."

"ఆబాగోగులు సరేకానీ అదలా పెళ్ళికాకుండా పడు న్నా ఫరవాలేదు. ఏంవయస్సు పెరిగిపోయిందనీ?"

రంగనాథం మౌనంగా ఉండిపోయాడు ఆలోచిస్తూ. భవానీకి మాత్రం వళ్ళు మండుకొచ్చింది ఆడబిడ్డమీద.

వాళ్ళ మంచికోరి ఆస్తులు అమ్మి పెద్ద ఉద్యోగస్తుల కిచ్చి పెళ్ళి చేయాలి. వాళ్ళ సంతోషం కోసం తాము బీదరికంలో మగ్గినా వచ్చినప్పుడల్లా సకల మర్యాదలూ చేసి పంపాలి. తమను రాజ్యం ఇంతచిన్న చూపు ఎలా చూసిందా? అన్న బిడ్డలు తమకంటే కిందస్థాయిలో ఉండాలనుకుంటే ఫరవాలేదు. అయోగ్యుడైన వాడికి పిల్లనిమ్మని తీసుకు రావటం... భవానీ మనస్సు భగ్గుమంది.

భవానీ ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ మూర్తి అన్నాడు "అన్నయ్యా, ఎటూ పొలం అమ్మావు కదా నాకో ఇరవై వేలు కావాలి. నేను ఓ అయిదారు నెలల్లో డబ్బు పంపించేస్తాను అమెరికా నుండి."

రంగనాథం దిగ్భ్రమగా చూస్తూ ఉండి పోయాడు తమ్ముడి వంక.

ఆ మసక వెన్నెలో అది గమనించని మూర్తి ఇంకా చెప్పుకు పోయాడు.


"మా ప్రొఫెసర్ చంద్రశేఖరంగారు నన్ను పైచదువు లకు అమెరికా పంపిస్తున్నారు. వాళ్ళమ్మాయిని నాకిచ్చి పెళ్ళి చేయాలని ఆయన ఉద్దేశం."

"అంటే నీ విక్కడ ప్రాక్టీసు చేయవా?" తేరుకొని అడిగాడు రంగనాథం.

"లేదన్నయ్యా ఇక్కడ ఈ పల్లెటూళ్ళో ప్రాక్టీసుపెట్టి నా భవిష్యత్ పాడుచేసుకోలేను. నీ జీవితం ఏమయ్యిందీ? గొర్రెకు బెత్తెడే తోక అన్నట్లు. అన్నయ్యా, ఇందులో నా స్వార్థమే అనుకో నా నిర్ణయం ఇదే."

ఆ మాటలు వింటున్న తరళ కోపం ఆపుకోలేక అటూ ఇటూ కదిలింది."

"అవును మీకోసం అన్నగారు జీవితాన్ని త్యాగంచేసి తన జీవితాన్ని బెత్తెడు తోకలాగా చేసుకున్నారు. తనూ తన పిల్లలూ ముష్టి వాళ్ళలాగా నిలబడ్డారు. చాలా పొరపాటే!" అని గట్టిగా అరిచి చెప్పాలనుకుంది.




బావాజి, కార్టూనిస్ట్, కురబాలకోట-517 350, చిత్తూరు-జిల్లా.

అది గమనించి సరళ చెల్లెల్ని దగ్గరకు తీసుకుని వీపు నిమురుతూ శాంతపరిచింది మౌనంగా.

భవానీ వచ్చే కన్నీళ్ళను మాటి మాటికీ కొంగుతో తుడుచుకుంటూ, గుండెలోని మంటల్ని ఆర్పుకుంటూ, పిల్లలికి ఇష్టమైన వంట ఎప్పుడైనా చేసిపెట్టానా? అత్తయ్యొచ్చినప్పుడనీ, బాబాయ్ వచ్చినప్పుడనీ ఎంత సముదాయించేది.

తన కన్న పిల్లల కోరికలు తీర్చకుండా వాళ్ళకి సకల మర్యాదలూ చేసింది. దానికి ప్రతిఫలం!

రంగనాథం ఆశాసౌధాలు ఒక్కసారి కూలిపోయాయ్. తమ్ముడు తమని ఆదుకుంటాడనుకోవటం చాలా పొరపాటు! తను భార్యాపిల్లల కోసం ఎప్పుడైనా ఆలోచించాడా? తమ్ముడు ఇక్కడే ప్రాక్టీసు పెట్టి తరళ పెళ్ళికూడా వైభవంగా చేస్తాడనీ ఏమేమో కలలు కన్నాడు.

ఈ ఉన్న పొలం కాస్తా అమ్మి తనకే ఆధారం లేకుండా... కంపించిపోయాడు రంగనాథం.

వాళ్ళ ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ మూర్తి అన్నాడు.

"నాకేదో డబ్బు అవసర మొచ్చి సరళ సంబంధం చెడగొడుతున్నానని మాత్రం అనుకోకండి. అంత నీచుణ్ణి కాదు. సరైన సమాచారం సేకరిస్తే వాడి గురించి మీకే తెలుస్తుంది. ఈ డబ్బు తీసుకునేవాణ్ణికాదు. వెళ్ళేప్పుడుమరీ చంద్రశేఖరంగారి మీదే ఆధారపడటం బాగోదని..."

"సరే తీసుకెళ్ళు" అని మాత్రం అనగలిగాడు రంగనాథం వ్యధని దాచుకుంటూ.

అపరాహ్ణం అయ్యింది. అమ్మా, సరళక్కా అదోలా ఉన్నారు.

ఓణీ కొంగు నడుంకి దోపి అన్నం వండింది.

ఆవకాయ తీసి, కాసిని వడియాలు వేయించి తండ్రిని భోజనానికి పిలిచి కూర్చోపెట్టి వడ్డించింది.

అప్పటి వరకూ చిన్నకూతురి చిలిపితనమే చూసిన భవానీ ఆ పిల్ల ఆరిందాతనం చూసి మురిసిపోయింది.

దొడ్లో జామచెట్టుకింద నులకమంచం వాల్చుకుని మేనువాల్చాడు రంగనాథం.

ఇంతలో రామం "మామయ్యా" అని పిలుస్తూ వచ్చి జేబులోంచి డబ్బు తీసి రంగనాథం కిస్తూ

"మొన్న నేను తీసుకున్న యూరియా బాపతు" అని చెప్పాడు.

"కూర్చోవోయ్" అన్నాడు లేచి కూర్చుంటూ రంగనాథం.

మంచం చివర కూర్చుంటూ అన్నాడు రామం "మామయ్యా మీరేమీ అనుకోనంటే ఓ సంగతి చెప్పి వెళ్ళటానికి వచ్చా."

ఏమిటన్నట్లు చూశాడు రంగనాథం.

"నిన్న మూర్తి మామయ్య వచ్చివెళ్ళాడనీ, తన దగ్గర పొలం అమ్మిన డబ్బు ఇరవైవేలు తీసుకెళ్ళాడనీ. పావుకారుగారు చెప్పారు.

కట్నంకి డబ్బు తక్కువై మీరు బాధపడుతున్నారేమోనని కూడా అన్నాడు. నేను మీకు పరాయివాణ్ణా మామయ్యా? నా దగ్గరెందుకూ దాపరికం? డబ్బు నేను సర్దగలుగుతాను.

అమ్మపేరిట బ్యాంకులో వేసిన డబ్బుంది. మీరు తీసి వాడుకోండి. మీరు డబ్బు విషయం నిశ్చింతగా ఉండండి."

ఆ మాటలు విన్న రంగనాథంకి కళ్ళల్లో నీళ్ళు ఉబికి వచ్చాయి.

ఉత్తరీయంతో తుడుచుకుంటూ "బాబూ రామం నా మీద నీకు కోపం లేదురా?"

"ఎందుకు మామయ్యా కోపం?"

"టపాపంచే బంట్రోతువని, పొలం దున్నుకునే వాడివనీ సరళని నీకివ్వ నిరాకరించాను. దూరపు కొండలు నునుపనుకున్నాను. నీకున్న మంచితనం గమనించలేదయ్యా."

అక్కడే తులసికోట అరుగుమీద కూర్చున్న భవానీకి "సొంత అక్కగార్నేమిటీ నా కొడుక్కి పిల్లనివ్వటానికి" అని సుబ్బమ్మొదిన కళ్ళొత్తుకోవటం జ్ఞాపక మొచ్చింది.

"రామం నిన్నోమాటఅడుగుతా. ఏమీ అనుకోవుగా" అన్నాడు రంగనాథం.

"నేనెప్పుడైనా మిమ్మల్ని తప్పుపట్టానా మామయ్యా. చెప్పండి మీరడిగేది ఏంటో?"

"నువ్వు సరళని పెళ్ళి చేసుకుంటావా బాబూ?"

"రామం కాసేపు మాట్లాడలేకపోయాడు. తేరుకుని "అదేంటి మామయ్యా. నేనేమన్నా పెద్ద ఉద్యోగస్తుణ్ణ ఏమన్నానా?"

"వద్దు బాబూ... పెద్ద ఉద్యోగాలూ వద్దూ పాడూ వద్దూ. మంచి మనస్సున్న నీకిస్తే మా సరళ సుఖపడుతుంది."

వంటింటి వరండా స్థంభాన్నానుకుని నిలబడ్డ సరళ వంక ఓరగా చూస్తూ "సరళకిష్టమైతే అమ్మకి చెప్తా" అన్నాడు రామం.

సరళ సిగ్గుపడుతూ అక్క... చి వంటింట్లోకి వెళ్ళిపోయింది. అది చూసి తరళ పక పకా నవ్వింది.

"అమ్మా సరళా ఇటురా" అని పిలిచి

"రామం బావకి కాఫీ తీసుకురా" అన్నాడు రంగనాథం.

భవానీ నొచ్చుకుంటూ "ఈ రోజు పాలు పిల్లితాగిపోయింది. అల్మరాలో పెట్టటం మర్చిపోయాం" అంది.

"ఆగండి ఒక్కనిముషం. సుబ్బమ్మత్త దగ్గరకెళ్ళి పాలు తీసుకొస్తా" అని గ్లాసు తీసుకెళుతూ

"సరళక్కా, బావను వెళ్ళనిచ్చేవ్. నే వచ్చేవరకూ కదలనీయకు" అంటూ తూరీగలా పరిగెత్తింది తరళ.

"వాళ్ళ పాలతో వాళ్ళకే కాఫీ! ఇది మరీ బాగుంది" భవానీ బుగ్గలు నొక్కుకుంది.

రామం బుంగ మూతిపెట్టి సరళని చూశాడు.

వచ్చేనవ్వు ఆపుకోలేక ఫక్కున నవ్వింది సరళ.


అదిచూసి భవానీ, రంగనాథం నోరారా నవ్వుకున్నారు.

అక్కడున్న జాజిపందిరి విరపూసి నవ్వింది.

నవ్వుల ప్రతి ధ్వనిలో ఆ పెరడంతా గుబాళించింది!

భారతీ శర్మ
కేరాఫ్. దేవశర్మ
వేల్పూరు.

★




కె.బి.భార్గవాచారి, హరివరం-పోస్ట్, కోవెలకుంట్ల(మం),కర్నూల్-518 139.